



మా సూరయ్య మామయ్య చాలా విచిత్రమైన మనిషి. నిజంగా ఆయనవంటి సత్పురుషుడు లేడు. కాని, అదేం ఖర్మమో, ఆయనకు అందరిలోకీ పేచీలే వచ్చేవి. ఇంకో చిత్రమేమిటంటే, హాయిగా కాలిమీద కాలేసుకు కూర్చున్నా జరిగిపొయ్యే అవకాశం ఉండికూడా, ఆయన ఏదో ఒకటి మీదవేసుకునేవాడు. ఏదో ఒక ఉద్యమం తలపెట్టేవాడు, వద్దు బాబో అంటున్నకొద్దీ మమ్మల్నందర్నీ అందులోకి ఈడ్చేవాడు. ప్లానులన్నీ చాలా బాగా ఉండేవి. కాని కార్యక్రమం ప్లానుప్రకారం నడిచేది కాదు. ఎక్కడో లోపం జరిగేది. ఆ లోపాలు దిద్దుకోబోతే ఇంకా లోపాలు జరిగేవి. తప్పు ఎవరిదైనా, తిట్లన్నీ ఆయనే పడేవాడు. అంతటితో ఆ ఉద్యమం అంతరించి పొయ్యేది.

"నే మొదటే చెప్పలా?" అని మా వెంకమ్మత్తయ్య మంగళం పాడేది.

నిక్షేపమంటి ఉద్యమం నీరు కారిపోవటం ఒకెత్తూ, ఆవిడ మంగళం పాడటం ఒకెత్తూగా ఉండేది మా మామయ్యకు.

"హరిః ఓం అంటూనే నువు, 'ఇదుగో నే చెబుతున్నా! ఇదుగో నామాట వినండీ!' అంటూ అక్షింతలు వెయ్యకపోతే అంతా చక్కగానే వెళ్లిపోను," అని మా సూరయ్య మామయ్య వెంకమ్మత్తయ్యతో అనేసి చివరమాట తనది చేసుకునేవాడు.

నాకు తెలిసినంతవరకూ మా మామయ్య ఆరంభించిన మొదటి ఉద్యమం ఉమాపతీవైద్యం.

1923 లో అనుకుంటా, ఓ నాడు ఆయన నన్ను పిలిపించి, "ఒరే, కాశీ, నిన్న నేం జరిగిందనుకున్నావు? నాకు తగని వేడిచేసి కళ్లు మంటలుగా ఉంటే, అట్లా కూరలు కొనటానికి పోతూ మన రాఘవయ్యగారింట్లోకి వెళ్లి, రాఘవయ్యతో కళ్లు మంటలుగా ఉన్నయి, ఏమన్నా మందివ్వవయ్యా అన్నా—" అని చెప్పసాగాడు మా సూరయ్య మామయ్య.

"కాస్త మజ్జిగ తాగలేక పోయినావా? అదే తగ్గేదిగా!" అన్నాను.

'చెప్పేది సాంతం వినవేం? అప్పుడు రాఘవయ్య ఏం చేశా డనుకున్నావు—"

"పంచదారమాత్రలు నోట్లో వేసిఉంటాడు."

"నే చెబుతున్నాగా?"

"నువు నన్నడిగితే చెప్పాను."

"నేను నిన్నేమీ అడగలేదు. చెబుతుంటే నువ్వడ్డం వచ్చావు."

"నన్నడిగావు."

'లేదు,'

'అడిగావు.'

'అది అడగటంకాదు.'

'అయితే చెప్పు.'

కొడవటిగంటి కుటుంబరావు

'ఆ మాత్రల్లు నోట్లో వేసుకున్నానో లేదో కళ్ళమంటలు కాస్తా ఇట్టే తీశాయి. ఏం చిత్రంరా ఈ ఉమాపతీ మాత్రల్లూ!'

'నాక్కూడా ఎప్పుడన్నా కళ్లమంటలెత్తితే ఉన్నట్టుండి ఇట్లాగే పోతయి.'

'నీ మొహం! నీకసలు ఉమాపతి సంగతి తెలియనే తెలియదు. నన్ను రాఘవయ్య ఎన్ని ప్రశ్నలు వేశా డనుకున్నావు! సంబంధం లేని ప్రశ్నలు. కళ్లమంటా, సెప్పా? తీపా, మంటా? అన్నం సయిస్తుందా? ఏం తినబుద్ధి అవుతుంది? కలలు వస్తాయా? ఏం కలలు? ఈవిధంగా అరగంట చంపాడు. చంపితే చంపాడు సెప్పికాస్తా చేత్తో తీసేసినట్టు పోయింది.'

'సెప్పా, మంటా?' అన్నాను.

అప్పటి కా విషయం అంతటితో పోయింది. నా కేదన్నా మంటగాని, సెప్పిగాని, తీపుగాని, పోటుగాని వస్తే ఆమందూ, ఈమందూ వేసుకోక వెళ్ళి రాఘవయ్య దగ్గర ఉమాపతి మాత్రల్లు తీసుకోమని మా మామయ్య నన్ను మరీ మరీ హెచ్చరించాడు.

ఒక నెల గడిచింది. ఒకరోజు మా వెంకమ్మత్తయ్య నాతో లబోమని గోలపెట్టింది.

'ఎట్లారా ఈయనతో?' అన్నదావిడ, నాకు ప్రశ్నలు వెయ్యటానికి మంచి అవకాశం ఇస్తూ.

'ఏమిటి? ఏం చేస్తున్నాడు?'

'అస్తమానం ఆ దిక్కుమాలిన పుస్తకాలు ముందేసుకుని రాత్రీపగలూ అదే పారాయణ. స్నానానికి లేవరు, భోజనానికి లేవరు. పిలిస్తే పలకరు. పలికినా కదలరు. చూస్తాను, చూస్తాను, ఆ పుస్తకాలూ, ఆ వెధవమందులూ వీధిలోకి గిరవాటేస్తాను. వొళ్లు మండిపోతోంది.'

నా కింకా అర్థం కాలేదు.

'ఏం పుస్తకాలు? ఏం మందులు?'

'సారి, నువ్వింకా చూడలేదా ఏం? చాలావు పుస్తకాలు. రామాయణ భారతాలంత లావున్నయి. తిరగేసి చూస్తునుగదా వాటినిండా అవాకులూ చవాకులూనూ. ఎక్కడ తీసి చదివినా పొట్ట ఉబ్బరింపులూ, రుతుస్రావాలూ నానా పచ్చి బద్దలూనూ. వాటి వెంట ఆ బల్లిగుడ్డు మాత్రల్లూ. వాటిల్లో మందే ఉండదుట, రోగాలు తక్కువ నయమవుతయిట! కమ్మని రోగాలూ, తియ్యటి మందులూ! రాతా రాత!'

నా కిప్పు డర్థమయింది. 'మామయ్యా ఉమాపతి వైద్యం చేస్తావా ఏమిటి?' అంటూ ఆయన దగ్గిరికి వెళ్ళాను.

సూరయ్య మామయ్య ఉత్తరపు వేపుగదిలో కిటికీదగ్గరిగా మడతమంచం వేసుకుని శ్రద్ధగా ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు.

'రారా, కాశీ! ఈ ఉమాపతి వైద్యం ఉందే, దీన్ని మించిన వైద్యం లేదు. ఇది ఒకటే నిజంగా శాస్త్రీయమైన వైద్యం. మిగిలిన మందులన్నీ రోగాలు పెంచేవేగాని నయం చేసేవి కావు. మరీ ఈ అల్లోపతీ వైద్యులున్నారే, వాళ్లు మనుషుల్ని నిష్కారణంగా చంపేస్తున్నారు. ఈ పుస్తకాలు నువుకూడా చదువు' అన్నాడు ఆయన.

ఆయనకు ఈ ఉమాపతీ వైద్యం వ్యాధిలాగా అంటుకున్నది. ఒకవ్యసనం వాతపడ్డవాడల్లే, మా మామయ్య ఆ పుస్తకాలలో విషయాలు నాకు అంతులేకుండా చెబుతూఉంటే ఆయనవ్యాధి నాకుకూడా అంటుకున్నది.

ఆయనకా పనీపాటా లేదు. నాకా, వేసవి శలవలు, అసలే పనీపాటా లేదు. ఇద్దరమూ రోజూ కలిసి పుస్తకాలు తిరగేసేవాళ్ళం. తరుణవ్యాధులూ, దీర్ఘవ్యాధులూ, వ్యాధిలక్షణాలూ, లక్షణాలను అణచటమూ, లక్షణాలలో మార్పూ, మందులూ, విరుగుళ్లూ, మందులలో పోలికలూ, ఉద్రేకోపశమనాలూ, మానసిక లక్షణాలూ మొదలైనవి దాదాపు కంఠస్థం చేశాం.

'మామయ్యా, మనం ఈ మందులతో అందర్నీ దంగెత్తించేద్దాం' అన్నాను.

కాని మాకు అవకాశాలు చిక్కలేదు. ఇంటో మా వెంకమ్మత్తయ్యలాటి ఆసుపత్రి ఉండీ ప్రయోజనం లేకపోయింది. ఆవిడకు ఎప్పుడూ శరీరంలో ఏదో ఒక భాగంలో ఏదో ఒక బాధ ఉంటూనే ఉంటుంది. కాని ఆవిడ 'వెధవ బల్లిగుడ్డు మాత్రల్లు తినను, ససేమిరా' అన్నది. పైపెచ్చు వాటిని బావిలో కుమ్మరించేస్తా నన్నది.

'మామయ్యా, నిజంగా ఆవిడ మాత్రల్లు బావిలో కుమ్మరించేస్తే మందులన్నీ మిలియను, మిలి

కును పొటెన్సీ అవుతాయి కాదూ? ఆ నీళ్లు తాగితే అన్నిరోగాలూ పోవూ?' అన్నాను అమాయికంగా.

'అన్నీ కలిపి కుమ్మరిస్తే ఒకదానికొకటి విరుగుడైపోవూ?' అన్నాడు మా మామయ్య అనుమానంగా.

'పోనీ, ఏనక్సువామికావో వేస్తే?' అన్నాను.

ఏమవుతుందో మామయ్య ఊహించలేక పోయినాడు. ఆసంగతి నేను గ్రహించకుండా ఉండటానికి, 'ఛీ, ఛీ అట్లా ఎన్నడూ పొటెన్సీ ఇవ్వరాదు', అని నానోరు మూశాడు.

మా అత్తయ్యేమో సహాయం నిరాకరించింది. మా మామయ్య రెండోకూతురు రవణికి రోగమూ రొష్టూ లేనేలేదు. దిమ్మిస చెక్కల్లే ఉంటుంది. ఆకలయినప్పుడల్లా జాడీలోనుంచి పట్టెడు ఆవకాయ తీసి తింటుంది. దానికేం చెయ్యదు- దానికున్న జబ్బల్లా ఒకటే—తిక్కముండ. అది కంచంలో ఒకేసారి వంకాయకూరా, దోసకాయ పచ్చడీ, పప్పూ, పులుసూ, నెయ్యీ, మజ్జిగా కుమ్మరించుకుని జుర్రటం నా కళ్ళారా చూశాను. అదేమిటే అంటే, "కడుపులో కలవ్వా?" అని అడిగింది.

"మామయ్యా రవణి తిక్కకేమైనా మందుందా?" అన్నాను. పుస్తకాలు తిరగేశాం. ఏమీ మందు తట్టలేదు.

నాకు ఉమాపతీ వైద్యంచూస్తే నిరుత్సాహం కలగసాగింది.

"మామయ్యా, ఈ వైద్యం చదవటానికి బాగుంది గాని చెయ్యటానికి వీలుకాదేమో,' అన్నాను.

"ఆదేంరా?"


"అందులో రాశారే ఆ మానసిక లక్షణాలు ఎవరికన్నా ఉంటయ్యా? తాను శరీరంనుంచి వేరైనట్టు భావన, తాను గాజుతో చేయబడినట్టు భావన, వస్తువులు సగము మాత్రమే కనపడుట, అంటూ రాస్తారే, ఎవరికన్నా ఇటువంటి జబ్బు లుంటయ్యా?"

'ఎక్కడో. ఉంటయి. లేకపోతే రాయరు,' అన్నాడు మా మామయ్య. ఇంతలో మాపాట పడింది. మా మామయ్య పెద్దకూతురు నరసు తన మొగుడికి వంటో సరిగా ఉండటం లేదనీ, తిని తిరుగుతున్నా చిక్కిపోతున్నాడనీ, మందు పుచ్చుకోమంటే పుచ్చుకోడనీ ఉత్తరం రాసింది.

సూరయ్య మామయ్యకు ఈ ఉత్తరం చూడగానే కళ్ళు మెరిసినయి.

'ఒరే, కాశీ, నరుసు మొగుడికేం మందిద్దామంటావు?' అన్నాడు.

'ఇంకా సందేహమెందుకు, మామయ్యా? ఆర్సెనికం ఆల్బం,' అన్నాను.



'నీకూ అట్లాగే తట్టిందిగదా? తియ్యి ఆర్స్ ఆల్బ్ 30.'

ఆ మందు మూడు పొట్లాలు కట్టి మంచి నీళ్ళలో కలిపి ఇవ్వమని నరసుకు ఉత్తరం రాస్తూ కవరులో పెట్టి పంపాడు.

మూడో రోజుకల్లా నరసు దగ్గిర్నుంచి జవాబువచ్చింది. మా మామయ్య చదివి వినిపించ సాగాడు.

'మూడు పొట్లాలు మంచి నీళ్ళలో కలిపి ఇచ్చాను. ఆయనది మనోవ్యాధి. మనోవ్యాధి కెక్కడన్నా మందుంటుందా? తనకింక రెండేళ్లే ఆయుర్దాయం ఉందని ఆయనికి బెంగ పట్టుకుంది. మాటిమాటికీ, ఇక నే రెండేళ్లకన్న బతకనూ అంటూ కంటనీరు పెట్టుకుంటారు.'

'ఎంత పొరపాటు చేశాం, మామయ్యా? ఆయనకి ఎకోనైటుగాని, అర్జంటం నిట్ గాని ఇవ్వాలిసింది,' అన్నాను అడ్డొస్తూ.

'ఇంకా వినూ,' అంటూ మామయ్యా చదవ సాగాడు. 'ఎప్పుడూ మన్నుతిన్న పామల్లే కూచుంటారు—'

'చూశావా? ఆర్స్ ఆల్బ్‌కు ఆందోళన ఉండాలి,' అన్నాను మళ్లీ.

'ఎవడో దిక్కుమాలిన జ్యోతిష్కుడు ఆయనతో రెండేళ్ళకి గండం ఉందని చెప్పాడుట. ఇది మా కొంప తీసింది...'

ఏం చెయ్యాలో నాకూ మా మామయ్యకూ పాలుపోలేదు. నరసు మొగుడు చావు భయంతో తీసుకుంటున్నాడు. దానికి చాలా మందు లున్నాయి. ఆర్స్ ఆల్బ్‌కూడా ఉంది. కాని ఇతర లక్షణాలు తెలిస్తేగాని ఏమీ చెయ్యటానికి లేదు.

ఇంతలో మరో రెండురోజులకు నరసు మళ్ళీ ఉత్తరం రాసింది—అకస్మాత్తుగా తన మొగుడు ఎప్పటిలాగా అయినాడని.

'మందు పని చేసింది!' అన్నాడు మామయ్య.

'చేసింది!' అన్నాను.

'వైద్యమంటే అట్లా ఉండాలి,' అన్నాడు మామయ్య.

'ఉండాలి!' అన్నాను.

'ఉమాపతీ అంటే మజాఖా?' అన్నాడు మామయ్య.

'మజాఖా?' అన్నాను.

ఇక మామయ్యకు ధైర్యం వచ్చింది. నాకూ వచ్చింది. మందుమాట ఎట్లాఉన్నా మేం చేసిన ఈ చికిత్సను గురించీ, ఉమాపతీ వైద్యం యొక్క ప్రత్యేక లక్షణాలను గురించీ మేం అందరిదగ్గిరా ప్రచారం ప్రారంభించాం.

అనేకమంది మాదగ్గిర మందులు పుచ్చుకోవడం మొదలుపెట్టారు.

ఈ దశలో మాకు అంతా అగ్నిపరీక్షే. రోగులు తమ లక్షణాలు సరిగా చెబుతున్నారో లేదో తెలీదు. మా మందు తీసుకుని ఎవరన్నా జబ్బు తగ్గలేదంటే—అన్నవాళ్లు చాలామంది లేకపోలేదు—వాళ్లు ఉమాపతి వైద్యానికి అపఖ్యాతి చేకూర్చటానికి అబద్ధం ఆడుతున్నారేమో అనిపించేది. మాకు ఎవరు శత్రువులో, ఎవరు మిత్రులో తెలిసేది కాదు. ఎవరికైనా మందు పనిచేసినట్టు దాఖలా ఇస్తే మాకు చెప్పరాని సంతోషం కలిగేది. అట్లా జబ్బు నయం చేసుకున్నవాళ్లు ఉమాపతి మందుల ప్రభావాన్ని గ్రహించినట్లు కనిపిస్తే మా ఆనందానికి హద్దే ఉండేది కాదు.

రోగాలు నయంచెయ్యటం కంటె కూడా పంచదారమాత్రం ప్రభావాన్ని ప్రచారంచేసి మేం పుచ్చుకున్న మతాన్ని ఇతరుల కివ్వటంలో మాకెక్కువ ఉత్సాహం ఉండేది.

ఎవరన్నా మా దగ్గిర మందు తీసుకుని, "కాస్త తగ్గిందా?" అని మేం అడిగితే "ఆఁ, మీ భ్రమగాని ఆ మందులతో రోగాలు నయమవుతయ్యా?" అని జవా బిచ్చినప్పుడు మాకు పట్టరాని ఆగ్రహం వచ్చేది.

ఆగ్రహం మాటకువస్తే మమ్మల్ని అవహేళన చేసేవాళ్ళను ఏకంగా చంపిపారెయ్య బుద్ధి అయేది.

"ఇదుగో, కాశీ! మీ మామయ్య నడిగి ఏదన్నా నాలుగు మాత్రలు పెట్టరా, తియ్యగా!" అని అడిగే నాస్తికులు మాకు దాపరించేవాళ్లు.

కాని మా కొక్కటే ధైర్యం: నిజం దాగదు; ఉమాపతి వైద్యంలో ఏమన్నా పస ఉంటే అది ఏనాటికైనా బయటపడి తీరాలి. మా వైద్యాన్ని మెచ్చుకుని ప్రచారం చేస్తున్న

వారి సంఖ్య జాస్తి అవుతున్నట్టు మాకు దాఖలా ఉంది.

ఒక్కందుకు మాకు చాలా చిరాకుగా ఉండేది. హేయమైన ఎలోపతీమందులు ఏళ్ళతరబడి పుచ్చుకునే పాషండులు మా మందు ఒక్క డోసు పుచ్చుకుని, "ఏం వైద్యం? వెధవవైద్యం! రోగం ఒక్క రవ్వయినా తగ్గలేదు," అనే వాళ్లు.

ఒకసారి ఒకావిడకి పెద్దపెట్టున జ్వరం వచ్చింది. ఆవిడకొడుకు ఊళ్లో లేడు. మా మామయ్యను పిలిపించింది. నేనూ వెంట వెళ్లాను జ్వరమూ, దగ్గు, దాహము ఉంది.

మా మామయ్య ఆవిణ్ణి ప్రశ్నించాడు. ఆవిడ విరక్తి సమాధానా లిచ్చింది. కాని అపరిమితమైన దాహం ఉందని తెలుసుకున్నాం.

'బ్రయోనియా!' అన్నాడు మా సూరయ్య మామయ్య తన చూపుడు వేలెత్తి.

'బ్రయోనియా!' అన్నాను నేను కూడా నా చూపుడు వేలెత్తి.

మా ఇద్దరి మొహాలమీదా తాండవమాడిన చిరునవ్వు చూస్తే ఆవిడ వ్యాధికి ఆయువుచెల్లిందని ఎవరైనా గ్రహించి ఉందురు.

నేను దాబ్బున పరుగెత్తుకొనిపోయి 'బ్రై30' సీసా తెచ్చాను. ఆవిడకు డోసు వేశాం. మరో నాలుగు పొట్లాలు కట్టి రోజుకు మూడు డోసులు వంతున వేసుకోమన్నాం.

మర్నాడు సాయంకాలం మందు పట్టుకుని వెళ్లాం.

'ఏమండీ, ఎట్లా ఉంది?' అన్నాడు మా మామయ్య. 'బాగా ఉందని నీనోటిమీదిగా అను. విందాం!' అన్నట్టుగా.

ఆవిడ భయంకరంగా మూలుగుతూ, హీన స్వరంతో 'బా-గా-నే-ఉంది' అన్నది, తల పక్కకి తిప్పేసుకుని.

నాకేమో ఆవిడమాట నమ్మబుద్ధి అయింది గాని, ఆవిణ్ణి చూస్తూంటే ఎందుకో భయం వేసింది.

'మందు మారుద్దామా, మామయ్యా?' అన్నాను.

'ఎందుకురా, ఆవిడ బాగానే ఉందంటుంటే?' అన్నాడు మా మామయ్య.

సరే మరో నాలుగుపొట్లాల మందిచ్చి వచ్చేశాం. మర్నాడు పొద్దున నేను వెళ్లేసరికి ఆవిడ కొడుకు యమకింకరుడల్లే వచ్చేశాడు. ఆవిడకి



రాత్రినుంచీ కళ్ళల్లో రక్తం పడుతున్నదిట! నా గుండె ఆగినట్టయింది.

నేను వచ్చిన కాస్సేపటికే డాక్టరు వచ్చేశాడు, గొట్టంతో సహా. గొట్టం పెట్టి ఆవిడ వీపంతా పరీక్షించాడు. 'న్యూ మో ని యా,' అన్నాడు.

ఈమాట వినగానే కొడుకు నిప్పుతొక్కిన కోతల్లే అయిపోయి, 'ఇంకా నయం! చచ్చిపోవలిసిందానివి! మంచి డాక్టర్ని పిలుచుకోరూ? న్యూమోనియా ఏమిటి? సూరయ్య మందివ్వట మేమిటి? ఈ సూరయ్యను ఎరెస్టు చేయిస్తాను,' అని పేలాడు.

నాకు పై ప్రాణాలు పైనే పోయినై.

'ఏం పర్వా లేదు. న్యూమోనియా తిరుగు ముఖంపట్టింది. ఇంజెక్షను ఇస్తాను,' అన్నాడు డాక్టరు.

నే నింటికి వచ్చి మా మామయ్యతో ఇదంతా చెప్పాను. ఆయన తొణకలేదు.

'న్యూమోనియాకు బ్రై) ఇవ్వాలి. మన మందే పనిచేసింది,'' అన్నా డాయన.

ఇది మా తృప్తే. ఊరంతా మేమే ఆవిడకి న్యూమోనియా తెప్పించి ఆవిణ్ణి చంపటానికి ప్రయత్నించినంత ప్రచారం జరిపింది. లోకులు పలుగాకులు అన్నమాట అబద్ధమా?

ఈ సమయంలోనే నరుసుమొగుణ్ణి గురించి మరో వార్త వచ్చింది. వాడు మారినమాట నిజమే గాని ఆమార్పు మే మనుకొన్నంత సంతోషకరమైనది కాదు. వాడు ఆస్తియావత్తూ ఒక్కొక్కరవ్వే అమ్మేసి ఇష్టంవచ్చినట్టు ముండలకీ తాగుడుకీ తగలేస్తూ దీపం వెలిగినట్టు వెలుగుతున్నాట్ట. రెండేళ్లకంటె ఆయుర్దాయం లేదనే భయం చివరకు వాణ్ణి ఈవిధంగా చేసింది. మే మిచ్చిన ఆర్స్ ఆల్బ ఏంచేసిందీ మాకిప్పుడు తెలియలేదు!

మా మామయ్యకు ఉమాపతి వైద్యంమీద మెల్లిగా విముఖత్వం కలగసాగింది. ఎందుకు కలగదూ! మేము నయంచేసిన న్యూమోనియా కేసుకు మాకు కానీ ముట్టలేదు గాని న్యూమోనియా అనిచెప్పిన వైద్యుడికి పాతికరూపాయలు ముట్టినయి.

అసలు మాకు దెబ్బెక్కడ ముట్టింది? ఉల్లాసంగా మందు పుచ్చుకునేవాళ్ళు, ఉచితంగా వస్తోందిగదా అని పుచ్చుకునేవాళ్ళు, చిల్లర రోగాలకు పుచ్చుకునేవాళ్లూ మమ్మల్ని కాల్చుకుతినసాగారు. మా మామయ్యను వేళగానివేళ ఎవరో రమ్మని పిలుచుకుపోవటమూ, ఈయన అచ్చిఊన్నట్టు పోయి మందులివ్వటమూ, రోగం కుదిరితే శుష్కప్రశంసను పొందటమూ, నయంకాకపోతే శాపనార్థాలు పడటమూ, చిన్నజబ్బులకు మాదగ్గిర ఉమాపతి మందులు తీసుకునేవాళ్లే కాస్త పెద్దజబ్బుచేస్తే ఏ ఎల్లోపతీవాణ్ణో తీసుకొచ్చి వైద్యంచేసుకుని డబ్బు ఇచ్చుకోవటమూ, ఇదంతా చూసి మా వెంకమ్మత్తయ్య భరించలేకపోయింది.

'మిమ్మల్ని చూసి అంతా నవ్వుకుంటున్నారు! కోతినిచేసి ఆడిస్తున్నారు! మీకే దిక్కుమాలిన మందులతో ఇల్లూ, వాకిలీ, పెళ్లాం, పిల్లలూ ఏమీ అక్కర్లేకుండా పోయింది! మీకామాత్రం జ్ఞానంలేదుటండీ?' అని ఆవిడ సూటీ పోటీలు తగిలింది.

నరుసు మొగుడికి మేమేదో మందు పెట్టి నరుసుకాపరం కాస్తా గోతిలో తోశామని కూడా ఆవిడ తననోటిమీదుగా అన్నదంటే నమ్మండి. మా మామయ్య ఉమాపతి ప్రభావం ఆవిడకి రుజువుచెయ్యటంకోసమని నరుసు మొగుడికి మందుపొట్లాలు పంపినమాట బయటపెట్టే వాడు మరి. అది పెద్దపొరపాటే అయింది.

ఇట్లా ఉండగా మా మామయ్యకే కాస్తజబ్బు చేసింది. మందేసుకున్నాడు. జబ్బు ఎక్కువయింది. ఇంకో మందేసుకున్నాడు. అది వేసుకున్న ఆయిదునిమిషాలకి అసలు మందుతట్టి ఆ అసలు మందేసుకున్నాడు - విరేచనాలు లంకించుకున్నయి. పుస్తకాలు తిరగేశాడు. ఏమందు చూసినా తనకు పనికొచ్చేటట్టుగానే కనిపించింది. వైద్యం చేసేవాడికి—ముఖ్యంగా ఉమాపతివైద్యం చేసేవాడికి—ఇంతకన్న దుస్థితిలేదు. తోచిన మందులల్లా వేసుకున్నాడు. మంచానపడ్డాడు.

మా అత్తయ్య నన్ను, 'వారే కాశీ! మీ మామయ్యకు నయమయేదాకా మా గదప

తొక్కితివా కాళ్లు విరగేస్తా!' అని నాకు అల్టిమేటమ్ ఇచ్చింది.

ఆరోజే అల్లోపతీ వైద్యుడు మా మామయ్య ఇంట అడుగుపెట్టాడు—గొట్టంతో సహా! ఏదో మందు రాసిచ్చాడు. రెండు రూపాయలు ఫీజు పుచ్చుకుని వెళ్ళాడు. మా అత్తయ్య మందు తెప్పించి బలవంతాన మా మామయ్యచేత తాగించిందిట. ఆవిషం ఆవిధంగా ఆయన వారం రోజులు తాగాక మళ్లీ మంచంలో లేచి కూర్చున్నాడు. ఆయన పూర్తిగా కోలుకునేటందుకు బాగా నెలపట్టింది.

ఆయన లేచి కూర్చుంటున్నాడని విని నేను వాళ్లింటికి వెళ్ళాను.

'చంపేసిందిరా, మీ అత్తయ్యా! నాపాలిటికి యమధర్మరాజల్లే వచ్చి నాచేత విషాలు మింగించాడు. ఒక్కడోసు నక్సు 30 పట్టుకురా, నాయనా!' అన్నాడు.

ఇంకా నక్సు 30 ఎక్కడుంది? మాఅత్తయ్య మందులన్నీ పారేసి, పుస్తకాలు పొయిలో వేసేసింది.

అంతటితో మా మామయ్య వైద్యం అయిపోయింది. కాని చింతించవలసిన విషయమేమంటే, ఇది జరిగిన ఆరునెల్లకే రాధాకిష్టయ్య మా వూళ్ళో ఉమాపతీవైద్యం ఆరంభించాడు. అడ్డమైన రోగాలూ ఇట్టే నయంచేశాడు. రెండు చేతులా డబ్బు గడించాడు. మావూళ్లో అల్లోపతీ వైద్యులందరికీ రాధాకిష్టయ్య పేరు చెబితే మంట. అయినా, ఉమాపతీ వైద్యాన్నీ వాళ్లు ఆడిపోసేమాట లన్నీ అన్నీకావు. వాళ్ళనోట రాధాకిష్టయ్య కరక్కాయ కొట్టాడు. వాళ్లు ఏళ్ల తరబడి నయంచెయ్యకుండా ఉన్న కేసుల్ని వారాలమీద కుదిర్చాడు.

మాఊళ్లో ఉమాపతివైద్యం ఇంటింటా వెలవటానికి కారణం రాధాకిష్టయ్యే. ఆయన్ని పొరుగూరువాళ్లు కూడా పిలుచుకుపోతూ ఉంటారు.

'నిజంగా ఉమాపతివైద్యమే వైద్యం. రాధాకిష్టయ్య మందిస్తాడు చూడూ! దానికి తిరుగుందా?' అంటారు ఊళ్లోవాళ్ళు.

సూరయ్యపేరు తలిచేవాడు లేడు. అందరిళ్ళలోనూ 'చెస్టు' ఉన్నది గాని సూరయ్య ఇంట్లో లేదు.

# ధాన్యంకొనుబడి : మిల్లర్లు

గుడిపాటి శ్రీహరికృష్ణ

ఆహారధాన్యాలకొరత నేటి సమస్యలలోకల్లా ప్రధానమైంది అనేది ప్రతిఒక్కరూ ఒప్పుకొంటున్నదే. కాని లభించినపంటను సక్రమంగా పోగుచేసుకోవడం, వీలుగా పంపిణీచేయడం మట్టుకు అనుకున్నంత విజయవంతంగా కొనసాగటంలేదు. అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు కూడా జవాబుదారీ పడవలసిన అగత్యంవున్నమాట వాస్తవం. ఈనాటి పరిస్థితినిబట్టి ప్రభుత్వమే ఒక నిర్ణీత విధానాన్ని అనుసరించటానికి సాహసించలేకపోతోంది సరికదా, రైతాంగాన్ని నొప్పించే విధంగా తన ఉద్యోగులు వ్యవహరించేస్థితిలోవుంటే చేతులు ముడుచుకొని కూర్చుంటోందనే భ్రమను, తాను ఊరుకోవడం మూలంగా కలుగజేస్తోంది.

రైతాంగంవద్దవున్న మిగులు ధాన్యాన్ని ఏప్రిల్ నెలాఖరులోగా ప్రభుత్వపు ఏజెంట్లకు-అంటే స్థానికంగా వున్న మిల్లర్లకు అమ్మవలసినదిగా హుకుం. సన్న కారు రైతాంగంలో ముప్పాతిక మూడుపాళ్లు పంటకళ్లాలలోనే తమకు కావలసినది పోగా మిగిలిన ధాన్యం అమ్మేసే వున్నారు. ప్రస్తుతంలో వున్న రైతాంగంలో దాదాపు నూటికి తొంభై మంది పెద్ద ఆసాములే అన్నది గుర్తించక తప్పదు. వీరు ఇంతవరకూ అమ్మకుండా ఉన్నది, ధర